

కంచన్‌బాగ్ డీఆర్‌డీఓలో..





జియాగూడ విద్యశ్రీ హైస్కూల్‌లో..

ఆరోగ్య యోగం

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, కాలనీలు, బస్తీల కమ్యూనిటీ హాళ్లు, పార్కుల్లో యోగాసనాలు వేశారు. నిత్యం క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని పలువురు ప్రముఖులు, యోగా గురువులు సూచించారు.

–అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



శారదనగర్‌లో యోగా గురువు ఎల్.ఎస్.నారాయణ ఆధ్వర్యంలో..



సింగరేణి భవన్‌లో..



ఆసనాలు వేస్తున్న ఇందిరా పార్కు యోగా సాధకులు



నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో..



ఇంద్రాణి మహా విద్యాలయలో..



యోగాసనాలు వేస్తున్న సీజీసీ ప్రతినిధులు



ఇబ్బిబన్ పార్కులో ఎన్ఆర్.లక్ష్మణరావు, తదితరులు



మెహిదీపట్నం సంతోష్‌నగర్ పార్కులో..



వేడుకల్లో సోమరాజ్ సింగ్, కార్పొరేటర్ లాల్‌సింగ్



శాంతినగర్ శ్లోకా ది స్కూల్‌లో..



సెయింట్ మార్క్ బాయ్స్ స్కూల్‌లో..



ఏక్తా జనశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..



పురానాపూల్ ఎస్పీనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో

యోగాతోనే మానవుడి ఆరోగ్యం సుభిక్షం



వేడుకల్లో ఆయూష్ మాజీ డైరెక్టర్ రాములు, బ్రిజ్‌లాల్ టపాడియా, సుధీర్ కులకర్ణి తదితరులు

అబిడ్స్: యోగాతోనే మానవుడి ఆరోగ్యం సుభిక్షంగా ఉంటుందని ఆయూష్ రాష్ట్ర మాజీ కమిషనర్ వి.రాములు పేర్కొన్నారు. భారతీయ యోగ్ సంస్థాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ యోగా డే వేడుకలు నిర్వహించారు. ఆయూష్ మాజీ కమిషనర్ రాములు, బీవైఎస్ తెలంగాణ వ్యవస్థాపకుడు బ్రిజ్‌లాల్ టపాడియా, తెలంగాణ రాష్ట్ర బీవైఎస్ అధ్యక్షుడు సుధీర్ కులకర్ణిలు యోగా వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా దాదాపు 500 మంది యోగా సాధకులు పలు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో నరేందర్ సింగ్‌జీ, మదుసుధన్‌జీ, ఇందిరాపార్క్ యోగా ప్రధాన శిక్షకులు సత్యనారాయణ గురుజీ, రామారావు గురుజీ, రాధ, మదుసుధన్, నాగశెట్టి, ప్రీతి సాగల్, సింహాద్రీ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ తానాజీనగర్ పద్మశాలి సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షుడిగా గుర్రం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా మన్న సతీష్, కోశాధికారిగా వనం మహేందర్‌లను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పద్మశాలి సంక్షేమ సంఘం కులస్తుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. తమను ఎన్నుకున్న కమిటీ సభ్యులకు ఈ సందర్భంగా వారు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

బేలా ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా సదానంద్‌యాదవ్



చార్మినార్: పాతబస్తీలోని బేలా చందులాల్ మాతేశ్వరి ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా పాటేల్ సదానంద్ యాదవ్ నియమితులయ్యారు. అలాగే కమిటీ ఉపాధ్యక్షుడిగా పాటేల్ నవీన్‌యాదవ్, విష్ణుమూర్తి, నర్సింగ్ పర్షాద్ జైస్వాల్, ప్రధాన కార్యదర్శిగా రాము యాదవ్, కోశాధికారిగా పాటేల్ శ్రీనివాస్‌యాదవ్, కార్యదర్శులుగా పాటేల్ స్వాబోద్‌యాదవ్, జే.సత్యనారాయణ, దేవేందర్‌నాథ్ ఆసూర్య తదితరులు నియమితులైనట్లు అధ్యక్షుడు పాటేల్ సదానంద్ యాదవ్ తెలిపారు.

తాగునీటి పైప్‌లైన్ పనుల పరిశీలన

గోల్కొండ: గుడిమల్కాపూర్ డివిజన్‌లోని మార్కండేయనగర్‌లో జరుగుతున్న తాగునీటి పైప్‌లైన్ పనులను బీజేపీ నాయకుడు దేవర వంశీ శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మార్కండేయనగర్‌తో పాటు డివిజన్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తాము గతంలో బల్దియా, జలమండలి అధికారులను కలిసి కోరడం జరిగిందన్నారు. అధికారులు స్పందించి పనులు చేయిస్తున్నారన్నారు. వెంకటేష్, శ్రీధర్, శివరాజ్ యాదవ్ తదితరులున్నారు.

బోనాల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తాం



చాంద్రాయణగుట్ట: బోనాల ఉత్సవాలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. రానున్న బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని చాంద్రాయణగుట్ట నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన భాగ్యనగర్ శ్రీ మహంకాళి బోనాల జాతర ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గాజుల అంజయ్య, మాజీ అధ్యక్షుడు రాకేష్ తివారీ, కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లపై ఉమ్మడి ఆలయాల కమిటీ సభ్యులు, అధికారులతో ఆరా తీసి, చేపట్టాల్సిన ఏర్పాట్లను జోనల్ కమిషనర్ ఈ సందర్భంగా అధికారులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ..జులై 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలకు సమస్యలు రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చాంద్రాయణగుట్ట, మలక్‌పేట్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్ల ఉప కమిషనర్లు సురేందర్, జయంత్, శ్రీనివాస్ రెడ్డి, రవి కుమార్, ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అమీనా బి, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఈఈలు నరేందర్ గౌడ్, హరికిశోర్, పీర్ సింగ్, ప్రకాశం, ఏకాంబరం పాల్గొన్నారు.

మరిది హత్యకేసులో వదినతోపాటు మరో వ్యక్తి రిమాండ్

గౌలిపురా: వివాహేతర సంబంధం విషయంలో ఓ వ్యక్తిని హత్య చేసిన ఘటనలో మహిళతో పాటు మరో వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ఎస్సై నరేందర్ వివరాల ప్రకారం..బార్కాస్ సలాల ప్రాంతానికి చెందిన మహమ్మద్ సల్మాన్ షరీఫ్(26), మహ్మద్ ఫేరోజ్ షరీఫ్ అన్నదమ్ములు. సల్మాన్ షరీఫ్ తన వదినతో తో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో సదరు మహిళకు సల్మాన్ షరీఫ్‌తో వేధింపులకు ఎక్కువయ్యాయి. ఈ విషయాన్ని తన భర్తకు తెలపకుండా కర్నాటక రాష్ట్రం గుల్బర్గ బసవకల్యాణ్‌లో ఉండే తన సోదరుడైన ఇలాహిల్లా (25) తెలిపింది. దీంతో ఇద్దరూ కలిసి సల్మాన్ షరీఫ్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. ఫేరోజ్ షరీఫ్ కుమారుడు బసవకల్యాణ్‌లో విద్యనభ్యసిస్తున్నాడు. ఈ నెల 10న ఫేరోజ్ భార్య కుమారుడిని చూసేందుకని మరిది సల్మాన్ షరీఫ్‌ను తీసుకొని బసవకల్యాణ్‌కు వెళ్లింది. పథకంలో భాగంగా ఇలాహిల్లా సల్మాన్ షరీఫ్‌ను తీసుకొని కారు డ్రైవింగ్ చేస్తూ గుల్బార్గాకు బయలుదేరాడు. మార్గమధ్యలో ఇలాహిల్లా తన స్నేహితులైన బసవకల్యాణ్‌కు చెందిన జహంగీర్, గౌస్, అన్సార్‌ను కారులో ఎక్కించుకున్నాడు. వెనుక సీటులో కూర్చున్న స్నేహితులు సల్మాన్ షరీఫ్‌ను తాడుతో ఉరేసి హత్య చేసి గుల్బర్గా డ్యామ్ పడేశారు. మూడ్రోజుల అనంతరం ఫేరోజ్ భార్య ఇంటికి చేరుకుంది. దీనిపై ఫేరోజ్ షరీఫ్ తన సోదరుడు సల్మాన్ షరీఫ్ కనిపించడం లేదని ఈ నెల 14న పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా ఫేరోజ్ భార్యను విచారించగా అసలు విషయం బయటపడింది. ఫేరోజ్ భార్య, ఇలాహిల్లాను శుక్రవారం భవానీనగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు జహంగీర్, గౌస్, అన్సార్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

బోనాలకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకోవాలి



గాజుల అంజయ్యను సన్మానిస్తున్న కోటిరెడ్డి తదితరులు

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని పాతబస్తీలోని ఉత్సవాల నిర్వాహకులు భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య కోరారు. ప్రముఖ బిల్డర్ కోటిరెడ్డితో పాటు కోట మైసమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు రాయికోటి బాబురాజా, మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి కాట రమేష్, వెంకట సుబ్బయ్య తదితరులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి బొకే అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి నుంచే తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

పాతబస్తీ బోనాలకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం



గౌలిపురా: పాతబస్తీలో నిర్వహించే ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల్లో పాల్గొనాలని శుక్రవారం మహంకాళి మాతేశ్వరి భారతమాత ఆలయం, కోట మైసమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. అనంతరం ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలె భాస్కర్ రాజ్, సుమన్ కుమార్ ముదిరాజ్, బొడ్డు సాయిబాబా, ఎ.శివచంద్రగిరి తదితరులు పాల్గొన్నారు.


మజ్లిస్ సెక్యులర్ పార్టీ: ఎమ్మెల్యే కౌసర్



మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ సెక్యులర్ పార్టీ అని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన మజ్లిస్ నాయకులు, కార్యకర్తలతో సంగారెడ్డి వెళ్లి మెదక్ అల్లర్ల నేపథ్యంలో అరెస్టయిన యువకుల కుటుంబాలను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ.. పోలీసుల అదుపులో ఉన్న యువకులకు అన్ని రకాల న్యాయ సహాయం అందించి అండగా ఉంటామన్నారు. మెదక్ అల్లర్లలో ప్రభుత్వం విచారణ చేయిస్తుందని అల్లర్లకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తాము ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గన్‌ఫౌండ్రీ: బాపట్ల వ్యవసాయ కళాశాల 1975వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం గోల్డెన్ జూబ్లీహాల్‌లో ఘనంగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి 60 మందికి పైగా స్నేహితులు హాజరై కళాశాల, వృత్తిపరమైన అనుభవాలను నెమరువేసుకున్నారు. 5 దశాబ్దాల తమ అనుభవాలను స్మరించుకున్నారు. అంతకు ముందు వెంకటరమణ, విశ్వనాథం బృందం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

'తిప్పర మీసం' విడుదల

అబిడ్స్: ఈనెల 30వ తేదీ నుంచి ఆంధ్రా ప్రీమియర్ లీగ్ ఏపీఎల్ 2024 కొత్త సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో బి.దశరథరామిరెడ్డి యాజమాన్యంలోని డిపెండింగ్ చాంపియన్ టీమ్ రాయలసీమ కింగ్స్‌కు చెందిన 'తిప్పర మీసం'సాంగ్‌ను విడుదల చేశారు. ప్రముఖ ఆల్‌రౌండర్ గిరినాథ్‌రెడ్డి నాయకత్వంతో పాటు వీవీవీ అప్పారావు కోచ్‌గా ఉన్న ఈ జట్టు ఈ సీజన్‌లో ఎంతో పటిష్టంగా ముందుకుపోతుంది. తెలుగు రాష్ట్రాల నుంచి క్రీడానైపుణ్యం ఉన్న అండర్–23 స్టార్లతో యువ క్రికెటర్ల ప్రతిభతో కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఆర్‌కే స్టోర్స్ లిమిటెడ్ బి.నాగభూషణం రెడ్డి మాట్లాడుతూ..తమ కొత్త గీతం తిప్పర మీసంను ఆవిష్కరించడం గర్వంగా ఉందన్నారు.

'మహా శూన్యం' పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువ కళావాహిణి ఆధ్వర్యంలో జన రచయిత డాక్టర్ డి.విజయభాస్కర్ రచించిన 'మహా శూన్యం'పుస్తకావిష్కరణ సభ శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ..పలు అంశాలపై రచయిత రచించిన తీరు ఎంతో అభినందనీయమని కొనియాడారు. అంతకు ముందు అహో ఆంధ్రా బోజ పేరిట నిర్వహించిన సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ సభ్యురాలు పి.రజినికుమారి, అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షులు సారిపల్లి కొండల్‌రావు, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, అనువాదకురాలు రాచకొండ అరుణ, సంస్థ అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌బోర్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



అబిడ్స్: వాటర్‌బోర్డులో ఉద్యోగుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని వాటర్‌వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వాటర్‌బోర్డు సెక్షన్ కార్యాలయంలో కనీసం ఉద్యోగులు, సిబ్బంది కోసం బాత్‌రూమ్‌లు కూడా లేకపోవడం చాలా బాధాకరమన్నారు. వెంటనే అన్ని సెక్షన్ కార్యాలయాల్లో బాత్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వాటర్‌బోర్డు జీఎం మహేందర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలంలో సిబ్బంది, కార్మికుల కోసం రెయిన్‌కోట్లు మంజూరు చేయాలన్నారు. వాటర్‌బోర్డు ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగులకు అండగా ఉండి వారి సంక్షేమానికి, వారి అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వైస్ ప్రెసిడెంట్ బి.కొమురయ్య, ఇతర ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఆర్.వెంకటేష్, జి.లక్ష్మణ్, బి.మహేష్, నరేందర్, శ్రీను పాల్గొన్నారు.

కూతురిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి జీవిత ఖైదు

దూద్‌బౌలి: కూతురిపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం జడ్జి అతనికి జీవిత ఖైదు విధించింది. 12వ మెట్రో పాలిటన్ సెషన్ జడ్జి టి.అనిత శుక్రవారం ఈ తీర్పును వెలువరించింది. హుస్సేనీ ఆలం సీఐ ఎస్.సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం..జామియా నిజామియా కాలిపాటక్ ప్రాంతానికి చెందిన షమీం ఖాన్ ఓ హోటల్‌లో వంట మనిషిగా పని చేస్తుండేవాడు. అతనికి ఎనిమిది మంది సంతానం. 2022 మే 15న కుటుంబ సభ్యులందరూ రాత్రి భోజనాలు ముగించుకొని భార్యాభర్తలు ఒక గదిలో నిద్రిస్తుండగా పిల్లలు మరో గదిలో నిద్రిస్తున్నారు. ఆ సమయంలో తండ్రి షమీం ఖాన్ అర్ధరాత్రి నిద్ర లేచి పక్క గదిలో నిద్రపోతున్న తన కూతురుపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. నిద్రలో ఉన్న ఆ బాలిక ఎదిరించలేక పోయింది. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. తిరిగి మూడు రోజుల తర్వాత మళ్లీ అర్ధరాత్రి అదే విధంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. జరిగిన ఘటన గురించి బాలిక మరుసటి రోజు తల్లికి చెప్పడంతో వెంటనే హుస్సేనీ ఆలం పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ నరేష్ కుమార్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగించారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏ.రామ్ రెడ్డి వాదనలు వినిపించగా.. కేసు పూర్వాపరాలు విన్న పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం జడ్జి అనిత నిందితునికి జీవిత ఖైదుతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.



ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత



అబిడ్స్: ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత ఉంటుందని ఉత్తర భారతీయ సమాజ్ నాయకులు బాకారం లదానా, అశోక్‌కుమార్ లదానాలు, తేజారామ్ లదర్వ పేర్కొన్నారు. ఈ ఉత్తరభారతీయుల గోత్రాలకు చెందిన పలువురు ఆశాపురా మాత జాగరణ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పలు గీతాలు ఆలపిస్తూ భజనలు చేశారు. వారు మాట్లాడుతూ..తమ గోత్రాల వారంతా ఆధ్యాత్మిక చింతన చెందే విధంగా జాగరణ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. బవర్‌లాల్, ధరమ్‌పాల్ పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు



శాలిబండ: మక్కా మసీదులో శుక్రవారం సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. ఈ సామూహిక ప్రార్థనల్లో ముస్లిం సోదరులతో పాటు మాజీ కార్పొరేటర్ మోసిన్ బాలలా తదితరులు పాల్గొన్నారు. ప్రార్థనల సందర్భంగా దక్షిణ మండలం పోలీసుల ఆధ్వర్యంలో చార్మినార్–మక్కా మసీదు పరిసరాల్లో బందోబస్తును ఏర్పాటు చేశారు.